నేటి మ్యాచ్ | భారత్ X న్యూజిలాండ్ మ.2.30 నుంచి






# కివీస్ కాస్కో

## నేడు భారత్ ఆఖరి లీగ్ పోరు

గ్రూపులో టాప్ లక్ష్యంగా బరిలోకి • చాంపియన్స్ ట్రోఫీ

ప్రతిష్ఠాత్మక చాంపియన్స్ ట్రోఫీలో మరో కీలక పోరుకు రంగం సిద్ధమైంది. మెగా టోర్నీలో ఓటమి ఎరుగని భారత్, న్యూజిలాండ్ ఆదివారం దుబాయ్‌లో తలపడబోతున్నాయి. వరుస విజయాలతో జోరు మీదున్న ఇరు జట్లు అదే ఊపులో గ్రూపులో అగ్రస్థానం దక్కించుకునేందుకు పావులు కదుపుతున్నాయి. బంగ్లాదేశ్, పాకిస్థాన్‌పై విజయాలతో టీమ్ఇండియా జోరుమీదుంటే..కివీస్ సమిష్టి ప్రదర్శనతో సత్తాచాటుతున్నది. స్పిన్ సమరంగా భావిస్తున్న మ్యాచ్‌లో ఎవరిది పైచేయి అనేది ఆసక్తి కరంగా మారింది. కీలకమైన సెమీస్‌కు ముందు తుది కూర్పుపై ఈ మ్యాచ్ ద్వారా రెండు జట్లు అంచనాకు వచ్చే అవకాశముంది. రెండు అత్యుత్తమ జట్ల మధ్య పోరు అభిమానులను అలరించడం ఖాయంగా కనిపిస్తున్నది. దాయాది పాకిస్థాన్‌పై సూపర్ సెంచరీతో చెలరేగిన విరాట్ కోహ్లీ..కివీస్‌తో పోరు ద్వారా వన్డేల్లో 300వ మ్యాచ్ ఆడబోతున్నాడు.

దుబాయ్: క్రికెట్ అభిమానులను ఆదివారం అలరించనుంది. చాంపియన్స్ ట్రోఫీలో తమ ఆఖరి లీగ్ మ్యాచ్‌లో భారత్, న్యూజిలాండ్ ముఖాముఖి పోరుకు సిద్ధమయ్యాయి. వరుస విజయాలతో మంచి జోరుమీదున్న ఈ రెండు జట్లు తమదైన వ్యూహాలతో బరిలోకి దిగబోతున్నాయి. రోజు తేడాతో జరిగే కీలకమైన సెమీఫైనల్ పోరుకు ముందు తమ అస్త్రశస్త్రాలను పరిశీలించుకునేందుకు ఈ మ్యాచ్‌ను వాడుకోనున్నారు. ముఖ్యంగా స్పిన్‌కు సహకరిస్తున్న దుబాయ్ పిచ్‌పై రెండు జట్లకు చెందిన స్పిన్నర్లు...బ్యాటర్లను ఇబ్బందులు పెట్టే అవకాశముంది. ఇటీవలి కాలంలో టీమ్ఇండియాకు న్యూజిలాండ్ కొరకరాని కొయ్యగా మారింది. మూడు మ్యాచ్‌ల టెస్టు సిరీస్‌లో భారత్‌ను భారత్‌లోనే ఓడించిన కివీస్ దీటైన సవాలు విసురుతున్నది. బలబలాల పరంగా సమవుజ్జీలుగా కనిపిస్తున్న టీమ్ఇండియా, కివీస్ మధ్య పోరు అభిమానులకు పసందైన విందు అందించనుంది. ఇదిలా ఉంటే దుబాయ్‌లో తమ మ్యాచ్‌లు ఆడుతున్న టీమ్ఇండియా ఇక్కడి పరిస్థితులకు అలవాటు పడింది.

**కోహ్లీపైనే కండ్లు:**

టీమ్ఇండియా స్టార్ బ్యాటర్ విరాట్ కోహ్లీపైనే అందరి కండ్లు ఉన్నాయి. చిరకాల ప్రత్యర్థి పాకిస్థాన్‌పై సూపర్ సెంచరీతో ఫామ్‌లోకి వచ్చిన కోహ్లీ..కివీస్‌తో పోరులోనూ అదరగొట్టాలని అభిమానులు ఆశిస్తున్నారు. తనదైన రోజున ప్రత్యర్థి ఎవరన్నది లెక్కచేయని కోహ్లీ పరుగుల వరద పారించడంలో ముందుంటాడు. పాక్‌తో మ్యాచ్‌లోనే ఇది రుజువైంది. అప్పటి వరకు ఫామ్‌లేమితో ఇబ్బందిపడ్డ కోహ్లీ..అఫ్రిదీ, రవూఫ్, నసిమ్ షాను సమర్థంగా ఎదుర్కొంటూ పరుగులు కొల్లగొట్టాడు. కివీస్ మ్యాచ్ ద్వారా అంతర్జాతీయంగా 300వ వన్డే ఆడబోతున్న కోహ్లీకి ఇది ప్రత్యేకం కానుంది. ఇదిలా ఉంటే కీలకమైన సెమీస్ మ్యాచ్‌కు ముందు టీమ్ఇండియా పలువురు ప్లేయర్లకు విశ్రాంతినిచ్చే అవకాశాలు కనిపిస్తున్నాయి. కెప్టెన్ రోహిత్ శర్మ, సీనియర్ పేసర్ షమీని తప్పిస్తే..రిషబ్ పంత్, అర్ష్‌దీప్‌సింగ్ తుది జట్టులోకి వచ్చే అవకాశముంది. చైనామన్ స్పిన్నర్ కుల్దీప్ యాదవ్ స్థానంలో మిస్టరీ స్పిన్నర్ వరుణ్ చక్రవర్తికి చాన్స్ దొరకవచ్చు. ఇదే జరిగితే తుది జట్టు ఎంపిక ఆసక్తికరంగా మారవచ్చు.



### కివీస్ జోరు

కీలకమైన చాంపియన్స్ ట్రోఫీకి ముందు నుంచి కివీస్ తమదైన జోరు కనబరుస్తున్నది. ముక్కోణపు సిరీస్ గెలిచిన కివీస్ అదే ఊపులో చాంపియన్స్ ట్రోఫీలో అదరగొడుతున్నది. తమ తొలి మ్యాచ్‌లోనే పాకిస్థాన్‌కు చెక్ పెట్టిన కివీస్..మలి పోరులో బంగ్లా దంచేశారు. టీమ్ఇండియాతో పోరులో కివీస్ స్పిన్నర్లు సాంట్నర్, బ్రాస్‌వెల్ కీలకం కానున్నారు. రచిన్ రవీంద్ర, యంగ్, లాథమ్, కాన్వే ఫామ్‌లో ఉండటం జట్టుకు కలిసిరానుంది.

**జట్ల అంచనా:**

**భారత్:** రోహిత్(కెప్టెన్), గిల్, కోహ్లీ, అయ్యర్, పంత్, హార్దిక్, జడేజా, సుందర్, రానా, కుల్దీప్/వరుణ్, షమీ/అర్ష్‌దీప్.

**న్యూజిలాండ్:** కాన్వే, రవీంద్ర, విలియమ్సన్, మిచెల్, లాథమ్, ఫిలిప్స్, బ్రాస్‌వెల్, సాంట్నర్, జెమీసన్, హెన్రీ, రూర్కీ.




# ప్లేఆఫ్స్‌లో ఢిల్లీ

## బెంగళూరుపై భారీ గెలుపు

బెంగళూరు: మహిళల ప్రీమియర్ లీగ్(డబ్ల్యూపీఎల్)లో ఢిల్లీ క్యాపిటల్స్ ప్లేఆఫ్స్‌లోకి దూసుకెళ్లింది. గత సీజన్‌లో రన్నరప్‌తో నిరాశచెందిన ఢిల్లీ ఈసారి దుమ్మురేపుతున్నది. డిఫెండింగ్ చాంపియన్ రాయల్ చాలెంజర్స్ బెంగళూరుతో వారి సొంతగడ్డపై శనివారం జరిగిన మ్యాచ్‌లో ఢిల్లీ 9 వికెట్ల తేడాతో భారీ విజయాన్ని సొంతం చేసుకుంది. తద్వారా వరుసగా మూడోసీజన్‌లో ఢిల్లీ..ప్లేఆఫ్స్‌కు అర్హత సాధించింది. మరోవైపు వరుసగా నాలుగో ఓటమి ఖాతాలో వేసుకున్న ఆర్‌సీబీ ప్లేఆఫ్స్ అవకాశాలను క్లిష్టం చేసుకుంది. ఆర్‌సీబీ నిర్దేశించిన 148 పరుగుల లక్ష్యాన్ని ఢిల్లీ 15.3 ఓవర్లలో వికెట్ కోల్పోయి 151 పరుగులు చేసింది. షెఫాలీవర్మ(43 బంతుల్లో 80 నాటౌట్, 8ఫోర్లు, 4 సిక్సులు), జెస్ జొనాసెన్(38 బంతుల్లో 61 నాటౌట్, 9ఫోర్లు, సిక్స్) అజేయ అర్ధసెంచరీలతో విజృంభించారు. బెంగళూరు బౌలర్లను చితకబాదుతూ లక్ష్యాన్ని అలవోకగా కరిగించారు. రేఖాసింగ్‌కు ఒక వికెట్ దక్కింది. తొలుత ఎలీస్ పెర్రీ(60 నాటౌట్) అర్ధసెంచరీతో ఆర్‌సీబీ 20 ఓవర్లలో 147/5 స్కోరు చేసింది. కెప్టెన్ మంధాన(8) మళ్లీ నిరాశపరిచింది. శిఖా పాండే, చరణి రెండేసి వికెట్లు తీశారు. షెఫాలీకి 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' దక్కింది.

# సెమీస్‌లో సఫారీలు

## ఇంగ్లండ్‌పై ఘన విజయం

### రాణించిన జాన్సెన్, డస్సెన్, క్లాసెన్



కరాచీ: చాంపియన్స్ ట్రోఫీలో దక్షిణాఫ్రికా సెమీఫైనల్లోకి దూసుకెళ్లింది. మెగాటోర్నీలో ముందంజ వేయాలంటే గెలువాల్సిన మ్యాచ్‌లో సమిష్టి ప్రదర్శనతో ఆకట్టుకుంది. శనివారం ఇంగ్లండ్‌తో జరిగిన తమ ఆఖరి లీగ్ మ్యాచ్‌లో దక్షిణాఫ్రికా 7 వికెట్ల తేడాతో ఘన విజయం సాధించింది. తద్వారా గ్రూపు-బీ టాపర్‌గా సెమీస్‌లోకి అడుగుపెట్టింది. ఇప్పటికే ఆస్ట్రేలియా అర్హత సాధించిన సంగతి తెలిసిందే. ఇంగ్లండ్ నిర్దేశించిన 180 పరుగుల లక్ష్యాన్ని సఫారీలు 29.1 ఓవర్లలో 3 వికెట్లు కోల్పోయి 181 పరుగులు చేశారు. డస్సెన్(72 నాటౌట్), క్లాసెన్(64) అర్ధసెంచరీలతో అదరగొట్టారు. ఇంగ్లండ్ బౌలింగ్ దాడిని నిలువరిస్తూ డస్సెన్, క్లాసెన్ వీరవిహారం చేశారు. వీరిద్దరు కలిసి మూడో వికెట్‌కు 127 పరుగుల భాగస్వామ్యం నెలకొల్పారు. ఆర్చర్(2/55) రెండు వికెట్లు తీశాడు. తొలుత జాన్సెన్(3/39), ముల్డర్(3/25) ధాటికి ఇంగ్లండ్ 38.2 ఓవర్లలో 179 పరుగులకు పరిమితమైంది. జోరూట్(37) టాప్ స్కోరర్‌గా నిలువగా, కెప్టెన్సీకి వీడ్కోలు పలికిన బట్లర్(21) నిరాశపరిచాడు. జాన్సెన్‌కు 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' దక్కింది. సెమీస్‌లో గ్రూపు-ఏలో రెండో స్థానంలో నిలిచే జట్టుతో దక్షిణాఫ్రికా తలపడుతుంది.

# డుప్లాంటిస్ @ 6.27మీటర్స్

## పోల్‌వాల్ట్‌లో సరికొత్త ప్రపంచ రికార్డు



క్లెర్‌మాంట్-ఫెరాండ్(ఫ్రాన్స్): స్వీడన్ పోల్ వాల్ట్ దిగ్గజం అర్మాండ్ డుప్లాంటిస్ మరోమారు ప్రపంచ రికార్డుతో సత్తాచాటాడు. పోల్‌వాల్ట్‌లో తనకు తిరుగులేదని చాటిచెబుతూ వరల్డ్ అథ్లెటిక్స్ ఇండోర్ టూర్ టోర్నీలో డుప్లాంటిస్ 6.27మీటర్ల ఎత్తు ఎగిరి కొత్త ప్రపంచ రికార్డును తన పేరిట లిఖించుకున్నాడు. ప్రపంచ, ఒలింపిక్స్ చాంపియన్ అయిన డుప్లాంటిస్..పోల్‌వాల్ట్‌లో ఏకంగా 11వ సారి ప్రపంచ రికార్డును సవరించుకోవడం విశేషం. తన తొలి ప్రయత్నంలోనే 6.27మీటర్లు ఎగిరిన ఈ దిగ్గజం ప్రత్యర్థులకు అందనంత ఎత్తులో నిలిచాడు. ఎమాన్యుయల్ కరాలిస్(6.02మీ) రెండో స్థానంలో నిలువగా, మరో ఆరుగురు 5.91మీటర్లకే పరిమితమయ్యారు.

# గుకేశ్ @3

## ఫిడే ప్రపంచ ర్యాంకింగ్స్

న్యూఢిల్లీ: ఫిడే తాజా ర్యాంకింగ్స్‌లో భారత గ్రాండ్‌మాస్టర్లు సత్తాచాటారు. ఇటీవల కాలంలో నిలకడగా రాణిస్తూ ప్రపంచ విజేతగా నిలిచిన దొమ్మరాజు గుకేశ్‌తో పాటు యువ జీఎం ప్రజ్ఞానంద తమ ర్యాంకింగ్స్ మెరుగుపర్చుకున్నారు. గత డిసెంబర్‌లో సింగపూర్‌లో జరిగిన ప్రపంచ చెస్‌చాంపియన్‌షిప్‌లో విజేతగా నిలిచిన గుకేశ్(2877) తన కెరీర్‌లో అత్యుత్తమంగా 3వ ర్యాంక్‌కు చేరుకున్నాడు. మాగ్నస్ కార్ల్‌సన్(2833), హికారు నకాముర(2802) వరుసగా తొలి రెండు ర్యాంక్‌ల్లో ఉన్నారు. ఇన్ని రోజులు భారత తరపున అత్యుత్తమ ర్యాంకర్‌గా కొనసాగిన ఇరిగేసి అర్జున్ (2777) ఐదు ర్యాంక్‌కు పడిపోయాడు. ప్రజ్ఞానంద(2758) 17 పాయింట్లతో తొలిసారి ఎనిమిది ర్యాంక్‌కు చేరుకున్నాడు.

# టీపీఎల్‌కు బీసీసీఐ గ్రీన్‌సిగ్నల్!


## జూన్‌లో లీగ్‌కు సన్నాహకాలు



హైదరాబాద్, ఆట ప్రతినిధి: తెలంగాణ ప్రీమియర్ లీగ్(టీపీఎల్) నిర్వహణకు బీసీసీఐ గ్రీన్‌సిగ్నల్ ఇచ్చిందని హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్(హెచ్‌సీఏ) అధ్యక్షుడు జగన్‌మోహన్‌రావు పేర్కొన్నారు. శనివారం ముంబైలోని బీసీసీఐ ప్రధాన కార్యాలయంలో జరిగిన సంయుక్త కార్యదర్శి ఎన్నికలో గోవా క్రికెట్ అసోసియేషన్‌కు చెందిన రోహన్ దేశాయ్ ఎన్నికయ్యారు. ఈ ఎన్నికలో హెచ్‌సీఏ ప్రతినిధిగా రోహన్ అభ్యర్థిత్వాన్ని జగన్ బలపర్చారు. ఈ సందర్భంగా బీసీసీఐ అధ్యక్షుడు రోజర్ బిన్నీ, ప్రధాన కార్యదర్శి దేవజిత్ సైకియాతో హెచ్‌సీఏ ప్రతినిధులు దల్జీత్ సింగ్, సునీల్ అగర్వాల్ భేటీ అయ్యారు. టీపీఎల్‌తో పాటు తెలంగాణలో ప్రఖ్యాతి గాంచిన మొయినుద్దౌలా గోల్డ్‌కప్‌ను తిరిగి ప్రారంభించేందుకు బీసీసీఐ సహకారం కావాలని జగన్ కోరగా, అందుకు బోర్డుకు సమ్మతించింది. ఐపీఎల్ ముగిసిన తర్వాత జూన్‌లో టీపీఎల్ నిర్వహణకు బోర్డు ఓకే చెప్పిందని ఆయన స్పష్టం చేశారు.

# కరణ్ అజేయ సెంచరీ

## విదర్భ రెండో ఇన్నింగ్స్ 249/4




నాగ్‌పూర్: విదర్భ స్టార్ బ్యాటర్ కరణ్ నాయర్..దేశవాళీలో దుమ్మురేపుతున్నాడు. ప్రత్యర్థి జట్లను చీల్చిచెండాడుతూ శతక జోరు కొనసాగిస్తున్నాడు. కేరళతో జరుగుతున్న రంజీ ట్రోఫీ ఫైనల్లో కరణ్ నాయర్(280 బంతుల్లో 132 నాటౌట్, 10ఫోర్లు, 2సిక్సులు) అజేయ సెంచరీతో కదంతొక్కాడు. దీంతో ఈ సీజన్‌లో ఓవరాల్‌గా తొమ్మిదో సెంచరీ ఖాతాలో వేసుకున్న నాయర్‌కు రంజీల్లో ఇది నాలుగోది కావడం విశేషం. నాయర్ సెంచరీతో విదర్భ నాలుగో రోజు శనివారం ఆట ముగిసే సరికి రెండో ఇన్నింగ్స్‌లో 4 వికెట్లకు 249 పరుగులు చేసింది. 7 పరుగులకే ఓపెనర్లు పార్థ్ రేఖాడే(1), ధృవ్ షోరే(5) వికెట్లు కోల్పోయిన విదర్భను దానిశ్ మలెవార్(73), నాయర్ ఆదుకున్నారు. వీరిద్దరు కేరళ బౌలింగ్‌ను సమర్థంగా ఎదుర్కొంటూ కీలక ఇన్నింగ్స్ ఆడారు. ముఖ్యంగా మంచి ఫామ్ మీదున్న నాయర్ తన ఇన్నింగ్స్‌లో 10ఫోర్లు, రెండు భారీ సిక్సులతో అలరించాడు. చంద్రన్ బౌలింగ్‌లో మలెవార్ ఔట్ కావడంతో మూడో వికెట్‌కు 187పరుగుల భాగస్వామ్యానికి బ్రేక్ పడింది. చేతిలో ఆరు వికెట్లు ఉన్న విదర్భ ప్రస్తుతం 286 పరుగుల ఆధిక్యంలో కొనసాగుతున్నది. నిదీశ్, సక్సేనా, ఆదిత్య, అక్షయ్ ఒక్కో వికెట్ తీశారు. ఆదివారం ఆటకు చివరి రోజు.






Printed and Published by **Damodar Rao Divakonda**, on behalf of Telangana Publications Pvt Ltd, Printed at Telangana Publications Pvt. Ltd, S.No.863/A, 863/C, Nustulapur, Opp: Grampanchayat Office, Timmapur Mandal, Dist: Karimnagar - 505 481,
Published at Telangana Publications Pvt. Ltd, S.No.863/A, 863/C, Nustulapur, Opp: Grampanchayat Office, Timmapur Mandal, Dist: Karimnagar - 505 481, Telangana State. Editor: **Thigulla Krishna Murthy.** Toll Free: 1800 425 3666. RNI No. TELTEL/2011/38229.